

శ్రీ

# —: జీవన్ముక్తి :—

## (కథా సంగ్రహం)

"జీవుడు" అనేవాడు ఒక మహా భక్తుడు. కూలీనాలి చెప్పులు కుట్టడం జీవనం. భార్య "సేవ". కొడుకు "భావుడు". బాలుడు. జీవుని కుటుంబం, సహజభక్త కుటుంబం! పూజా సమయానికి ప్రతిరోజు దేవుడు వీళ్లయింటికి వచ్చేవాడు. కలో-అంబలో అమృతంగా ఆరగించేవాడు

ఆనాడు ముక్కోటి ఏకాదశి, జీవుడింట్లో నైవేద్యానికేమీలేదు. రెండు చెప్పులజతలమ్మి - వచ్చిన డబ్బులతో యింటోకేమన్నా తెమ్మని - జీవుడు తన కొడుకును, భావుణ్ణి ఊళ్ళోకి పంపుతాడు. తిరిగి తిరిగి - యెక్కడ అమ్ముడు పోక-భావుడువస్తూ - దారిలో రాజగురువు వాకిట్లో పూలమాలలు కట్టుతున్న శిష్యులను చూచి-దగ్గరికి పోయి - పూలమాలను చూచి ముచ్చటపడి - ఆ జోళ్లు యిచ్చి - పూలమాల తీసుకుపోతాడు.

శాంత : రాజగురు పుత్రిక. శిష్యులను "పూలమాల యేది?" అంటూ వస్తుంది. శిష్యులు తెల్లమొగం వేస్తారు. పూలహారం తెమ్మని వాళ్లని చీవాట్లుపెట్టి తరుముతుంది. అట్టేపడి భావుణ్ని వెతుకుతూ, వెతుకుతూ, పూలమ్మే ఒక పిల్లను చూసి బేరమాడుతూ - దానింటికి పోతారు. దీనిమొగుడు గ్రుడ్డివాడు. వీళ్లు యింటికి వచ్చినప్పుడు గ్రుడ్డివాడు యింట్లో లేడు. కాస్సేపట్లో వచ్చి-ఒక శిష్యుడి అలికిడి యింటో విని భార్యా అనుకొని ముద్దుచేసి తుదకు దొంగ అని కుండా చట్టీ విసరి యిల్లంతా అల్లరి చేస్తాడు. యెట్లాగో శిష్యులు తప్పించుకు బైట పడతారు.

భావుడు - పూలమాలతో యింటికి పోతాడు. తల్లి కసిరి-యీపూలమాల యిచ్చేసి - డబ్బులు తెమ్మని భావుణ్ణి మళ్ళీ పంపిస్తుంది. భావుడు రాజగురు ద్వారం దగ్గిర శిష్యుల్ని పిలుస్తూ వెతుకుతూ వుంటాడు. యింతలో శాంత వచ్చి-మాటలవల్ల - భావుడింటికి దేవుడొస్తాడని తెలుసుకొని - వాడివెంటనే జీవునింటికి పోతుంది. ఈ సమయంలో జీవుడింట్లో దేవుడు ప్రత్యక్షంగా నైవేద్యం ఆరగిస్తూ ఉంటాడు. శాంత చూచి - పొంగి - తన్మయత్వంతో - పాటలతో - గంతులతో యింటికి వస్తుంది.

రాజగురువు పూజచేస్తూ వుంటాడు. చుట్టూ - బ్రాహ్మణబృందం పరివేష్టించి వుంటుంది. శాంత - గంతులువేస్తూ వస్తుంది. బ్రాహ్మణులు - యీపిల్ల భ్రష్టురాలైందని గోలపెడ్తారు. యిక చూసుకోండి - రాజగురు ఆగ్రహం! శాంతను

చీకటికొట్లో పారేసి - అన్నపానాదులు వల్లకాదంటాడు. జీవుణ్ణి నవిలి మింగుదా మన్నంతగా కోపించి - "రాజమాతకు రేపు చెప్పులనోమున్నది. తెల్లవారేసరికి వెయ్యిజోళ్లు కావలెనని" జీవుణ్ణి ఆజ్ఞాపిస్తాడు.

శాంత ఆ కొట్లో దైవధ్యానంతో ఉంటుంది. అక్కడ జీవుడు - భార్య - కొడుకు, చెప్పులుకుట్టుతూ - కుట్టుతూ నిద్రపోతారు. లేచి చూచేసరికి యింటినిండ చెప్పులే. ఇది - దైవకటాక్షంగా తెలుసుకొంటాడు. భావుడు చెప్పులు-రాజగురువు కప్పగిస్తాడు. కక్కసు పట్టలేక - పాపం భావుణ్ణి రాళ్లతో కొట్టిస్తాడు. రాజ గురువు జీవుణ్ణికూడా తెప్పించి జైలులో వేయిస్తాడు.

శాంత గదిలోనుంచి తప్పించుకొని జీవుణ్ని విడిపించమని తండ్రిని బ్రతిమాలుతుంది. యింతకుముందే-జీవుణ్ని రాజు విచారించటం - కళ్లు కర్రులతో కాల్పించి - చేతులు నరకమనటం - జరుగుతుంది. శాంతకు ప్రాయశ్చిత్తం కావాలి- యింట్లోకి రానీయడు. వెలుపలనే గుళ్లోకట్టి పడేయిస్తాడు. గుడి మంటపంలో ప్రాయశ్చిత్తహోమాలు ప్రారంభిస్తాడు. శాంతను పూలపిల్ల కట్లువిప్పి తప్పిం స్తుంది. శాంత మాలపల్లెకు పోయి - పిల్లలగుంపుతో మండపంలో ప్రవేశించి- తనతోపాటు వాళ్ళనుకూడ పవిత్రం చేయమంటుంది. రాజగురుకోపం మితిమీరి - శాంతను రాతి కొట్లో పడేసి - వెంటవచ్చిన పిల్లలనందర్ని బంధించేస్తాడు. శాంత మళ్లీ తప్పించుకొంటుంది. మాలపల్లెకుపోయి పిల్లలగోడంతా చెప్తుంది. [illegible] కంతా నువ్వే కారణమని మాలగుంపు శాంతను జీవుడింట్లో కట్టిపడేస్తారు.

సేవ-కారాగారంలోనున్న జీవుణ్ణి చూడ్డానికిపోయి-భర్తకు జరిగిన శిక్ష చూసి కెవ్వున కేకవేసి తనకళ్లు రెండు తానే పీకివైచుకొంటుంది. భూకంపం: జైలు గోడలు పడిపోవటం: శ్రీమహావిష్ణువు - శ్రీదేవి, భూదేవులతో యెరుకల వేషంలోవచ్చి-పతివ్రతయైన సేవ కళ్లకు కాటుకపెట్టి బాగుచేస్తారు.

ఈ ఉత్పాతాలు చూచి-రాజగురు వింకా ఆగ్రహిస్తాడు. మాల పల్లెలన్నీ తగులపెట్టమంటాడు. ఇంతలో శిష్యులువచ్చి శాంత - 'పోయిం' దంటారు. చచ్చి పోయిందని రాజగురు అనుకొని హాహాకారాల్తో పరుగెత్తగా-దారిలో మాలగుంపు యెదురుపడుతుంది. శాంతను కట్టిపడేశాం అంటారు. రాజగురు జీవుడింటివేపు పరుగెత్తుక పోతాడు. అప్పటికే మాలపల్లె అంతా దగ్ధపటలమై-పిల్లా, జల్లా ముసలి ముతకా గొడ్డుగోదా గొల్లున గోలగా వుంటుంది. జీవుడింట్లో-జీవుడు, శాంత, సేవ, భావుడు అతిమధుర భక్తిగానంలో వుంటారు. గరుడవాహనంతో విష్ణు మూర్తి అమృతవర్షం కురిపిస్తాడు: పోయిన యిళ్లన్నీ యింద్రజాలంగా మళ్లీ యథావిధిగా ఉంటై!

రాజగురు మనస్సంతా మారుతుంది - పశ్చాత్తాప పడ్తాడు. జీవుని భక్తిని మెచ్చుకుంటాడు. ఈ ఆనంద దృశ్యం తెరమీద చూస్తే బాగావుంటుంది.

# —: జీవన్ముక్తి :—

## పాటలు

శ్లో॥ కౌసల్యా సుప్రజా రామ। పూర్వాసంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల। కర్తవ్యం దైవ మాహ్నికం॥

### 1. సాతాని

మేలుకో జీవా! జీవా! తూర్పు తెలవారే
వేగమే భానుడుదయించె, విజ్ఞాన భాను డుదయించె
కలరావంబుల పులుగులబారు
కైవారము లొసగె ప్రకృతికి! (స్వామికి)
తమ తమ జీవన విధులకు పోయి
తరింప వేళాయె - మేలుకో, మేలుకో, మేలుకో.

### భజన

శ్రీనివాస హరిగోవింద! చిద్విలాసభాసా!
కేశవా పరేశా! కేశవా పరేశా!
నందబాల రాధాలోలా! నవ పింఛమా...లా
నవహేమ చే...లా! నవనీత చో...రా
వాసుదేవ హరిగోవిందా! కేశవా ముకుందా!
కేశవా ముకుందా! గోపాల గోవింద! గోపాల గోవింద

### 2: సేవ (రాజరత్నం)

ఆయే...వేళాయే! హరిమాయిలు సేరగ...వేళాయె
ముచ్చటగొలిపే ముగ్గులు చూచి, మెచ్చుకొను గాదా!
యెంతో... మెచ్చుకొను గాదా!
స్వామి... మెచ్చుకొను గాదా!

### జీవ (సూరిబాబు)

రారా...కట్టుదమా సుమమాలా!
శ్రీహరికీ తులసీ మాలా!
గంధము దీసి యుంచుదామా!
ధూపదీప మొసగేమా!
చిగురు తోరణాలు కడదామా!

### 3. భావుడు (మాస్టరు విశ్వం)

గారెలూ బూరెలూ ముదము మీర నొసగెదా పాడెదా

### అందరు

ఆడుచుపాడి... దేవునకు - అడుగులు
పూజలు సేయుదమా ! పూజ సేయుదామా
పూలా... పూజసేయుదామా.

### 4. భావుడు: (మాస్టర్ విశ్వం)

జోడు కొంటారా బాబూ - జోడు కొంటారా !
సన్న నగిషీ పనులా జోడూ
మన్నికైనా మంచీ జోడూ — జోడు కొంటారా-బాబూ
ఎన్ని జతలా నడుమానున్న - కన్నుగుట్టే కాలి జోడు
జోడుకొంటారా - బాబూ - జోడు కొంటారా॥

### 5. శాంత: (కమలా కుమారి)

హాయిగా, హాయిగా, పూజసేయుదునా - నే - పూజసేయుదునా !
జలకమాడ సేయుదునా - అలకలు తీరుతునా !
తిలకము జేరుతునా - అగరూ తిలకము జేరుతునా ॥
గోపాలా ॥ పూజసేయు

### 6. రాజగురు శిష్యులు: (సోమన్న - యగ్గన్న)

బొద్దుగా - ముద్దుగా, కట్టుదామా
గులాబి మాలా
విరజాజీ - మరుమల్లీ - విరులా - సరములు
కడదామా - కడదామా - గోపాలా
మెడలో - వడిగా - వేదామా — వేదామా, వేదామా॥

### భావుడు

దొరలూ కాళ్ళ తొడిగే జోడూ
రంగైనా రంగుల జోడూ
ధరకూ తగినా చక్కని జోడూ
చలికీ - వేడికి - నిలిచే జోడూ — జోడు కొంటారా॥
అయ్యా — — — అయ్యా

### 7. —: పువ్వులంగడి పాట :—

పూలోయమ్మా - పూలండయ్యా
పూవులు - చక్కని - కమ్మని పూలూ
పూల హారాలూ - మంచి - పూల హారాలూ

మరువం - దమనం - మాచిపత్రి
మల్లెలు - మొల్లలు - మందారములు
నవమాలికలూ - తోమాలికలూ
వట్టివేళ్లూ - తులసీ కదంబం
కొని కైసేయుడు గోవిందునను
రండోరయ్యా - రారండమ్మా
రండోరయ్యా - రారండమ్మా
రమణీ రమణుల కమరెడు పూలూ ॥ పూలో ॥

## 8. పూలపిల్ల (లక్ష్మీదేవి)

లీలా రసికులు కోరెడు పూలూ
విరాగులైనను కొసరెడు పూలూ
సరాగమ్ముగా ధరియించు పూలూ
పూలో—పూలో
పూలో-మంచిపూలూ ! చక్కని పూలూ, మంచిపూలూ
తావీపీడని తా..పూలూ
మోహము రేపే - ముద్దులపూలూ
నవదంపతులకు నాజెపు పూలూ
సానల దీరిన మరుని శరాలూ పూలో మంచి పూలో
ఇదిగో పూబంతి ! యిదిగో చామంతి !
ఇదిగో గులాబి ! యిదిగో, యిదిగో, యిదిగో, యిదిగో
ఇదిగో వాసంతి - యిదిగో గులాబీ
వేడుకతో కొనరండీ - బాబూ
వేడుకతో కొనరండి "పూలో"

## 9. (జీవ - సేవ - భావ)

దేవా...దీనదయాళో...హరే...మురారే !
వైకుంఠనాథా...జగన్నాథా...రారా దేవా॥

ముగ్గురు :

అరగింపరారా...విందారగింపరారా
కరుణాలవాల రారా... వేగా॥ అర॥

జీవ॥ దినదినమునునుము కనికరింతువీ
దినమున తామసమేలా...

సేవ॥ ముక్కోటి కదా... ముల్లోకములా
మొక్కులలోనుము మరచేవా॥ అర॥

ముగ్గురు :

ఆరగింపరారా... విందారగింపరారా
సేవ॥ రావోయీ గిరిధారీ! దయసేయుమా మురారీ!
రాజ రార! రారాజ రార! మహతేజరార!
ఇదె భోజనమ్ముకొన రారా॥
విందవైతి - అరవిందనయన
బువ్వతిందుగాని రారా... తిందుగాని రారా
దాసకోటిపై-దయచూపుటలో-నీసమానులేరీ భువిలో-నీసమానులేరీ॥

ముగ్గురు :

మముకరుణగనుము గిరిధారీ! నీయడుగు విడము గిరిధారీ
నీ భజన విడము గిరిధారీ! గిరిధారీ! గిరిధారీ! గిరిధారీ!

## 10. శాంత (కమలాకుమారి)

చూచితిగా... చూచితిగా... చూచితిగా...
చూచితిగా... చూచితిగా... చూచితిగా...
కనుల పండువుగా నేడే... కనులపండువుగా నేడే...
వేదశిఖలపై వెలసెడువాని - పాదకమలములు నే నే చూచితిగా
అమరులకైనా అమరగబోని
అమృతపానము చేసితిగా
చనుడీ అదిగో జీవుని విడిదీ
కొనుడీ అమృతము వేగముగా
కనుడీ జీవన్ముక్తీ - జీవన్ముక్తీ - జీవన్ముక్తీ...
నీలమేఘరుచివాని - సిరికాలవాలమగు వాని!
శంఖమూ - చక్రమూ చేధరించిన వాని, నే చూచితి॥
నానా... యేమి పలుకుదు నానా...
నీ కెటుల తెల్పుదు నానా
ఏమి పలుకను? ఏమి తెలుపను? ఆవినోదము నానా!
ఏమి పలుకుదు నానా!
చందమామకన్నా - చాలా - అందమైన మోమూ
మందహాసము - చిందు వేయునా - నందనందనా
చూచితిగా - చూచితిగా - చూచితిగా॥

## యాత్రికుల భజనపాట

రంగని సేవింపవే, మనసా - రంగని సేవింపవే
కస్తూరీ-రంగని సేవింపవే! కావేటీ - రంగని సేవింపవే.
మంగళాకరుని - మామనోహరుని॥ ॥రంగని॥

శరనిధి దేవేరి - కావేరి
తరగ చామరల - తను సేవింప
పతితుల బ్రోచిన - బడలిక తీర
ఫణిపతి శయ్యపై - పవళించిన శ్రీ ॥రంగని॥
సకలపాపములు - సమయగ నేగి
చంద్రపుష్కరిణి - జలముల దోగి
తనువున పులకలు - దైవా రంగా
మనసారంగా - రంగాయని శ్రీ ॥రంగని॥

కావేటి రంగా - కస్తూరి రంగా
జైజై రంగా - రంగా ! రంగా॥

## 11. పిల్లల దశావతార పాటలు

జయ జయ, పరమాత్మ - సకల భువన కారణా!
సకల భువనకారణా!
విలయమైన నిగమములను , సలువ కిడిన మీనమూర్తి!
మీనమూర్తి! మీనమూర్తీ!! జయజయ॥
అమరులకై మందరాద్రి - అవధరించిన కూర్మరూప !
కూర్మరూప ! కూర్మరూపా ! జయజయ॥
అవని భరించిన ఆదివరాహా! ఆదివరాహా!
భువి ప్రహ్లాదుని - బ్రోచిన నరసింహా!
నరసింహా! నరసింహా!! జయజయ॥
బలినడచిన శ్రీ - వామనమూర్తి - పరశురామ
క్షత్రియకుల భీమా - పరశురామా ! క్షత్రియకులభీమా
పరశురామా! పరశురామా! పరశురామా జయజయ॥
తారకనామా! దశరథరామా! దనుజవిరామా!
దైవలలామా! శ్రీరఘురామా! శ్రీరఘురామా! శ్రీరఘు జయజయ॥
నందయశోదా-నందముకుందా-బృందాలోలా!
వేణుగోపాలా! వేణుగోపాలా! వేణుగోపాలా జయజయ॥

## 12. (గుడ్డివాని పాట)

పలుకే బంగారమాయెనా ? సిన్నారి సిలకా !
పలుకే బంగారమాయెనా ॥ ॥ పలుకే ॥—

మాటలు : ఎక్కడున్నావే ? ఇదిగో ! యిదిగో !
సిలకా ! నా బంగారు గిలకా ! బిల్వేరద్దం పలకా !
మరువంపు మొలకా - యేలా అలుకా ? ॥ పలుకే॥—

...ంటలు : సిట్టీ! పొట్టీ! చిన్నారీ! కిన్నారీ!!
సిట్టీ - నాదు సెవులు పట్టి మెలిపెట్టి కొట్టూ। చెంపా పెట్టు -
ఆ - వూ - అంటే వొట్టు॥ పలుకే - ఒక్క పలుకే॥

## 13. శాంత : (కమలా కుమారి)

దాశరథే! దయాశరధే॥ దాశ॥
కావా రావా! కనరావా॥ దాశ॥
దీనుల గాచే - దొరవటగా! దీనజనావనా! బిరుదటగా॥ దాశ॥

### జీవ : (నూరిబాబు :)

మానవకోటికి - నీపద భజనే - మాయని - పెన్నిధిగా!
మానసమున నిక - మరువనివారి - మనసున - కొరతే - లేదటగా॥ దాశ॥
నీపదసేవా - మానితినా! నినువిడి - యితరుల - చేరితినా?
నీకీ శోధన - ఏల ప్రభో! ఏల ప్రభో! ఏల ప్రభో॥
మాకీ - ఆపద - బాపగదే?॥ దాశ॥

## 14. సేవ

ఆహా!... నా తరమా నుతిసేయా!
నిను నా తరమా నుతిసేయా!
కాంచితో లేదో - దీనుల నాడూ,
బ్రోచితిగా నేడూ - కరుణా,
చూచితిగా నేడూ - కరుణా, నా తరమా॥

నీ చరితము మది - నమ్మినవారికి - నిజము తెలిసెగా నేడూ!
నిజము తెలిసెగా నేడూ, ఆహా... నా తరమా॥

...వ
...వ
...ావ } నీ కరుణామృత - నిధిగలవారికి
నాకరాజ్యములు - కాసునకా?

మంచుకొండవలె - మలసిన బాధలు
మంచుపోలికా - మాయునుగా॥ నా తరమా॥

## 15. భావుడు : (బండి పాట)

బాలుడే - గోపాల బాలుడే! మాపాలి దేవుడూ
ఆలమంద నావలె నే - తోలినవాడూ॥ బాలుడే॥

నాడు కుచేలుడిన్ని - దయతోడ నేలినాడు
మరి నేడు నమ్ముగావ - మాయింట వెలసినాడూ॥ బాలుడే॥

ముజ్జగాలు బొజ్జలోన మోసినవాడూ
గజ్జలు ఘలు ఘల్లుమనగ - ఆడెడువాడూ
పాట పాడెడువాడూ
ఆ యమునా తీరమునా - చల్లన పిల్లన గ్రోవి
ఊదినవాడూ - మమ్మేలినవాడూ - కృష్ణుడే !
ఆ చిన్ని కృష్ణుడే - హో......ఆ బాలుడే ॥
"హై ! హై !"
ఘల్లుఘల్లుమని బాగా - చిరుగంటలెల్ల బల్ మ్రోగా
కాళింగు పడగపై నిలచి, ధిం ధిమ్మని ఆడినవాడూ
మా దేవర నల్లనివాడు - మా దీనత బాపినవాడూ
మా దిగులే దీర్చినవాడూ ॥ బాలుడే ॥

## 16. సేవ

ఏలరావోయీ - కన్నయ్యా ! జీవుడు పూజకు లేడని జాగా॥ ఏల॥
జీవదాసునా జీవమెక్కాదా సేవయేకదా జీవుని ఛాయా
వాసుదేవనా దోసము లేమీ దాసురాల్నిపై దయమానితివా॥ ఏల॥
సాగుమనగీ - వినవూ - కనవూ లేదాకరుణా - పేదలపైనా
పాదదాసులా - కావబోతివా నాదుమాట వినరావా
నాదుమాట వినరావా॥ ఏల॥

## 17. శాంత - భావ - పిల్లలపాట

పోవుదము - కోవెలకు రండి బిరానా హోయి హోయిగా॥
లేదుసుమా దేవునకు జాతివిభేదం - వర్ణాలవిభేదం
పోయినా - లభించబోని - మంచిరోజురా
మనజన్మ లేతరించు నేడు - హోయిహోయిగా॥ పోవు॥
మనసు తనియగా - ఆ మహిమగగ నేమా నేమా
పువులతో - కనులతో - పూజసేతమా పూజసేతమా
మన వేరా గుడులిక - మనవేరా యికా
ముగిసెనింక పతితులా విలాపగీతికా॥ పోవు॥

### పద్యం జీవుడు (ధన్యాసి)

శా॥ ఆకల్లాడదొకింత లోకమున, నీ యాదేశమేలేక ! మా
కీ కర్మానుభవంబు నీయభిమతంబే కాక వేరేమి? తం
డ్రీ ! కాయంబిది మంటిలో కలసిపోనీ ! ఆత్మ నీ యాత్మలో
శ్రీకైవల్య పదంబుచేర్చి పునరావృత్తిన్ నిరోధింపవే.

## జీవుడు - పాట

18. వెలిగింపుమా - నాలోజ్యోతి॥ వెలి॥
తిలకింతు గా - ఓదేవా - ఆవెలుగులోనే నీమూర్తి॥ వెలి॥
మనసుదీరనీ మంగళమూర్తిని
కనజాలనియీా - కనులేలా
హరినీసేవకు - కొరగావేనీ
కరములు - పీడా కరములుగావే॥ జ్యోతి వెలి॥
మాయజగము - కసుమాల జీవితము
హేయమినీ—నారాయణ చాలూ
హరి - హరీ - జీవుడియాతనబాపీ.
దరిజేర్పగదే - పరమాత్మా॥ జ్యోతి వెలిగింపుమా॥

## 19. భావుడు - పిల్లలు

అమ్మా : అయ్యో!
అమ్మా : అయ్యో!

భావుడు:— మొరవిను వారేలేరా యీ చెరవిడిపింపగ రారా
మా మొరవినువారే లేరా॥ యీపని పాపల నేరము లేమీ
ఆకలితోనిటు అలవటింపగా పేదలబాధలు చూడవేడుకా
లేదా యిలదయ రాధామాపై మామొర వినువారేలేరా॥

20. జైజైరాం—హరె—జానకిరాం జైజై పావన నామా రాం
జైజైరాం హరె జానకి రాం జైజైరాం హరె జైజైరాం

21. శ్రీరఘు నందన జైజైరాం శ్రితజనచందన జైజైరాం
సీతావల్లభ జైజైరాం కరుణాసాగర జైజైరాం
జైజైరాం హరె జానకిరాం జైజై పావననామారాం,
శ్రీహరిభక్తి - జీవన్ముక్తి ఇహపరభుక్తి - జీవన్ముక్తి
జీవన్ముక్తి - జీవన్ముక్తి రామహరే రఘు రామహరే॥

శ్రీరస్తు

మంగళం మహత్.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీ

# జీవన్ముక్తి

## నటీనట వర్గం

| | | | |
|---|---|---|---|
| జీవుడు | పి. సూరిబాబు | బ్రహ్మానంద | సి. యస్. నరసింహశాస్త్రి |
| భావుడు | మాస్టర్ విశ్వం | కులపెద్ద | కోటీశ్వరరావు |
| రాజగురు | బలిజేపల్లి లక్ష్మీకాంత కవి | పోతడు | వి. కొండలరావు |
| రాజు | డి. లక్ష్మయ్య నాదరి | పీరడు | జనార్దనం |
| మహావిష్ణు | వి. వి. శఠగోపన్ | సేవ | బెజవాడ రాజరత్నం |
| యగ్నన్న | L. S. నారాయణ | శాంత | కమల కుమారి |
| సోమన్న | Dr. కే. శివరామ కృష్ణయ్య | శ్రీదేవి | అన్నపూర్ణ |
| గ్రుడ్డివాడు | మాధవరావు | భూదేవి | శాంత |
| సచ్చిదానంద | వి. లక్ష్మీకాంత కవి | పూల పిల్ల | లక్ష్మీదేవి |

దర్శకుడు
టి. వి. నీలకంఠన్, బి. ఏ. బి. ఎల్.

సహాయ దర్శకులు;
L. S. నారాయణ
రామచంద్రరావు

కవి:
కవితా కళానిధి
బలిజేపల్లి లక్ష్మీకాంత కవి

సంగీత దర్శకుడు
రాజేశ్వరరావు

ఫోటోగ్రఫీ:
శైలన్ బోస్

శబ్ద గ్రహణము:
పి. కే. విశ్వనాథ్

రికార్డింగ్:
బి. ఏ. ఎక్స్. సౌండు సిస్టమ్

ఆర్టు డైరెక్షన్:
కే. ఆర్. శర్మ
గూడ్‌వాన్కర్

మేక్-అప్:
హరిబాబు
మంగయ్య

ప్రాసెసింగు:
జెమిని లేబరేటరి

ఎడిటింగు:
జే. ఎల్. సర్కార్

ప్రొడక్షన్ మేనేజర్:
గోపాల్ కే. మహరిష్

ప్రొడక్షన్ అధికారి:
కే. ఎస్. గోపాలకృష్ణన్

స్టిల్ ఫోటోగ్రాఫర్:
సోము

డిస్ట్రిబ్యూషన్: జెమిని పిక్చర్స్ సర్క్యూట్
141, బ్రాడ్వే, జి. టి., మద్రాసు, 19, ఉత్తర చిత్తిర వీధి, మధుర
13/146, T. D. రోడ్డు, ఎర్ణాకుళం

ఆంధ్ర దేశమునకు సబ్ డిస్ట్రిబ్యూటర్లు:
చంద్రమియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్, బెజవాడ.

The Jupiter Press, Madras.